# తప్పెవరిది?

శ్రీ కాంచనపల్లి వేంకటరంగారావుగారు

శారదాబిల్లు ననుసరించి రజస్వల అయిన రెండు సంవత్సరాలకు అనగా పదహారేండ్లకు ఎన్నెన్ని సంబంధాలలో చూచిచూచి కడకు విసివి వేసారి ఎత్తెత్తి ఎంగిలాకులో కాలేసినట్లు లలిత కయిష్టమయిన ఓ గుమస్తాపని చేస్తున్న అబ్బాయికిచ్చి పెళ్లి చేశారు. ఏలాగో లలితకుకూడా మనస్సు ప్రకారం కాదగిన భర్త కాకపోయినా, మనువు నిమిత్తము దొరికాడు. అంతటితో లలిత మరోయింటి పిల్ల అయిపోయింది. వివాహానంతరం మూడునెలల్లో కార్యం కూడా చేసేసి కాపురానికి పంపించేశారు. వివాహం నిమిత్తమే చదువుకుంటున్నదా అన్నట్లు నేర్చుకుంటున్న ఫీడేలు, యింటిప్రైవేట్లు, స్కూలుచదువు, అన్నీ మూలబడ్డాయి.

కాపరానికి వచ్చిన ఆరునెలలో లలిత గర్భము దాల్చింది. నెలతప్పిన నాలుగునెలలకే పుట్టింటివారు మొదటిదఫా గనుక ముద్దు ముచ్చటలు జరుపుకునే నిమిత్తం పుట్టింటికి తీసుకుపోయారు. పుట్టిల్లూ అత్తవారియిల్లూ రెండూ ఒకవూళ్లోవే. కాని మధ్య మూడున్నరమైళ్లదూరం వుంటుంది. భర్త మోహనరావు ఏదో పని పెట్టుకొని లలితను రోజూ కొకమారైనా చూసిపోతూ వుండేవాడు. ఇష్టమున్నప్పుడు అల్లుడ్ని భోజనానికి వుండిపో అనేవారు. లేనప్పుడు చూసీచూడనట్లు మామగారు అత్తగారు వూరుకునేవారు. ఒక్కొక్కప్పుడు ఏదో సంకల్పించుకొని మామగారితో పదిగంటలవరకు కాలక్షేపం చేసి 'ఇంటికి వెళతానండీ చాలారాత్రి అయినట్లుంది' అనేవాడు అయిష్టంగానే పైకిమట్టుకు. ఇప్పుడింత చీకట్లో వెళ్లకపోతే యీరాత్రి యిక్కడే పడుకోకూడదూ? తెల్లవారగానే కాఫీత్రాగి వెళిపోవచ్చు అని మామగారో అత్తగారో, ఎవరూ రాకపోతే భార్యవల్ల ప్రోత్సహింపబడ్డ చిన్న బావమరిదో అనడం మారు మాట్లాడకుండా ఆరాత్రికి అక్కడే గడిపేవాడు.

ఇలా కొన్ని నెలలు గడిచాయి. మోహనరావు ఆఫీసు పనిమీద కాకినాడకు వెళ్లాడు. ఆతను వెళ్లిన మరునాడే పురుడొచ్చింది. ఆడపిల్ల పుట్టింది. చూడ్డానికి బహు వికృతంగా వుంది. కాళ్లు రెండూ వెనక్కు మణిగి అంటుకుపోయినాయి. చేతులు రెండూ కడుపుప్రక్కలకు అతుక్కుని వున్నాయి. తల్లి ఏంచేస్తుంది? నా ఖర్మం అనుకుంటూ అలాగే పాలిస్తూ, చేయవలసిన శిశుపోషణ చేస్తూ భర్తవస్తే ఎలా ముఖమెత్తుకొని తిరగడమా అని సిగ్గుపడింది. తనేమిటో చేయకూడని గొప్ప పొరపాటు చేసినట్లు తలంచింది. తల్లిదండ్రులు కూతుర్ని వూరడిస్తూ మనమరాలికి సంరక్షణ చేయించేవారు. భారసాలకు అల్లుణ్ణి పిలవడం వాళ్లకు యిష్టం లేకపోయింది. వివరాలు ఏమీ వ్రాయకుండా 'పురుడైంది. ఆడపిల్ల. తల్లి పిల్ల కులాసాగా యున్నారు' అని మట్టుకు ఒక కార్డు ఎలాగో వ్రాశారు. పాపం అంతకుముందు ప్రతినిత్యంవెళ్లి చూసే మోహనరావుకు అసలు పురుడైన వెంటనే వెళ్లి చూడ్డానికి ప్రాప్తిలేనిస్థితికి విచారిస్తూ, పురుడైన తొమ్మిదోనాటికి ఎలాగో దిగబడ్డాడు మామగారియింటికి. ఆశ, ఆతురత పెనగులాడుచుండగా వెళ్లాడు.

అకస్మాత్తుగా చూచి అందరూ ఆశ్చర్యపోయారు. ఒకరుకూడా ఆహ్వానంచేశారు గారు. అయిష్టంతోటే 'వెళ్లి చూడు ఆగదిలో' అన్నారు మనం చెప్పడం దేనికని. చిరుసిగ్గుతో గది ముందుకు చేరాడు. భార్య ఆగది పెరటిగుమ్మందగ్గిర నిలబడింది. మంచం క్రింద పెట్టిన కుంపటి సెగకు గాబోలు ఆపిల్ల ఒక్కమారుగా కెవ్వుమంది. గబగబ మంచం దగ్గరకు లలిత వచ్చింది. ఒకమూలను

భర్త నిలబడ్డాడు. తలయెత్తి ఒకమారు చూచి వెంటనే దించేసింది. మరి ఎత్తలేకపోయిందా అన్నట్లు అలా వుండిపోయింది. శిశువుని చూద్దామని వచ్చిన మోహనరావుకు ఆదృశ్యం చూడ్డానికివుండే ఆతురతకంటే, యీవైఖరి చూడ్డం మూలాన కలిగిన ఆందోళన జాస్తి అయింది. కారణం తెలుసుకోలేక పోయాడు. రెండుమూడు కంటిబొట్లు రాలడంకూడా గమనించాడు. సంగతేమిటని పలకరించడానికి యితనికికూడా మనస్కరించలేదా అన్నట్లు నోరాడింది గాదు. శిలావిగ్రహాల్లాగ నిలబడిపోయారు. ఇంతలో మంచీ చెడ్డా తెలియని లలితచెల్లెలు ఆరేండ్లపిల్ల గబగబ కళ్లు నులుపుకుంటూ గదిముందుకు వచ్చి "బావా! బావా!! చూశావా ఆపిల్లని, కాళ్లుచేతులూ ఎలా అంటుకు పోయాయో" అంది. అంతవరకు చూపకుండానే గుడ్డమటుగున మాటుపరచిన ఆశరీరాన్ని మరి చూపకుండా వుండడానికి వీలైంది గాదు. గుడ్డ తీసి వెక్కి వెక్కి ఏడ్వడం సాగించింది లలిత. మోహనరావు ఇటువంటి పిల్ల అసలు కలుగకపోయినా, లేక కలిగినవెంటనే చనిపోయినా సంతోషించివుందునే అని లోపల అనుకోక పోలేదు. ఇరువురు తమతమ తప్పేదో యిందులో యిమిడివుందని లోలోపల విచారించడం మొదలుపెట్టారు.

కొంతసేపు వూరుకుని భర్తనుచూచి 'మంచిపనే చేశారు. కడుపునిండిన సంతానం—లేకపోతే ఎవడేడ్చాడు' అంది నిస్సాకారంగాను, నిర్మొఖమాటంగాను. ఏంచేస్తాడు పాపం మోహనరావుమట్టుకు. నిలువునా లలితమాటలకు నీరై, నిర్ఘాంతపోతూ నిలబడిపోయాడు భర్త. భార్యమీద ఆమాటలకు రాదగినంత కోపంవచ్చింది. ఇటువంటి సంతానానికి కారణంతనే అని లలిత నిందించినట్టు గ్రహించుకొని మారుమాట్లాడకుండా వచ్చిన తీరునే వెళ్లిపోయాడు. మోహనరావు మాత్రం బ్రతికున్నంతకాలం మరి లలిత ముఖం చూడకూడదని నిశ్చయం చేసుకొని ముఖం కూడా కనపర్చడం మానేశాడు.

భర్త పదిరోజుల కొకమారైనా (వూళ్లోనే వున్నాడు గనుక) వచ్చి కనబడుటలేదే యని ఒకవంక, కలిగిన వికృతాకారపుశిశు సందర్శన ఆందోళన ఒకవంక మనస్సు వేధించ మొదలుపెట్టాయి. ఆ రోజున భరించరాని దుఃఖ ఆవేదనతో ఏవేవో అన్న మాటలు మనస్సును నొప్పించాయి గాబోలు. తమ యిరువురియందు మనస్పర్ధలు కలిగించి, చూపుల కెడము చేసినది యీ శిశువే అని పూర్తిఅయిన అయిష్టముతోనే కన్నకడుపవడంవల్ల ఎలాగో పెంచుతోంది. పిల్లకు మూడునెలలు వెళ్లాయి. ఇకను పంపించేద్దామా అని పుట్టింటివారు అనుకునే వేళకు కడుపులో బల్లవున్నట్లు మందిప్పించపలసినట్లు తెలుసుకున్నారు. అల్లుడి యింట్లో మరో ఆడ రక్షిత లేకపోవడం మూలాన తమవద్దనే వుంచుకొని మందిప్పించక తప్పింది గాదు. ఈలోపున ఎన్ని కబుర్లో మోహనరావు రాకకై వెళ్లాయి. ఎప్పటి భోగట్టాలు అప్పుడు విని తెలుసుకొంటూ వుండేవాడు. లలిత క్షమాపణ కోరుకుంటూ ఎన్ని చీట్లో వ్రాసింది. మోహనరావు అదేమిటో ఆ శిశువున్న తావుకు వెళ్లడం అసహ్యించుకునేవాడు.

డాక్టరులు ఏ మందు యిచ్చినా ఆ లివరుజబ్బు పోయిందిగాదు. పెద్దపొట్ట అంటుకుపోయిన సన్న చేతులు కాళ్లూను. ఇక మరి బ్రతకదని అందరూ నిశ్చయించుకున్నారు. ఒకనాడు అలాగే పక్కమీదే కళ్లుమూసేశాడు. తల్లి గొల్లుమని ఏడ్చింది. ఇంట్లో అంతా ఓ ఏడ్పు ఏడ్చేశారు. కాని అటువంటిదృశ్యం ప్రతినిత్యం చూసేదానికంటే పోతేనే బాగని అనుకుంటున్న లలిత అంతగా ఆ చావుకు విచారపడలేదు. నూతనశిశువును చూడ్డానికి ఎంత పైపైని మురుస్తూ వెనుక వచ్చాడో యిప్పుడుకూడా మోహనరావు లోలోపల అంత మురియుచూవచ్చి లలితను ఓదార్చాడు. లోకాచారం జరిగి పోయింది. లలిత

ప్రోద్బలంచేతను, మామగారియొక్క ఆజ్ఞచేతను, అత్తగారి బ్రతిమాలుడువల్లను మోహనరావు పది రోజులపాటు అక్కడే వుండాలనిచ్చింది. అనంతరం లలిత–మోహనరావులు తమయింటికి వెళ్లిపోయారు.

ఇలా పదినెలలు జరిగిపోయేసరికి తిరిగి లలిత కడుపుతో వుంది. ఈ సారైనా ముద్దైన సంతానం కలుగుతే బాగుండునని వీరిరువురే కాకుండా తెలిసిన తనలోకమంతా అనుకున్నారు. పుట్టింటివారు యథాప్రకారంతీసుకెళ్లారు. కొంచెం నెలలు ముదరగానే, భర్త రెండుమూడు రోజుల కొకమారు వచ్చిచూసి వెళుతూ వుండేవాడు. ఓరోజుఉదయం ఎనిమిదిగంటలకు పురుడొచ్చింది. మొగసంతానం. కాని ఏంలాభం? మోచేతులు, మోకాళ్లు అసలు లేవు. ఆ మొండెం చూసే చూడ్డం లలిత భరించలేని ఆవేదనా దుఃఖంతో మూర్ఛపోయింది. భర్తఎదుట ఎలా ముఖమెత్తుకొని తిరగడమా అనుకుంది. ఇటువంటి సంతానాన్ని కంటున్న నన్ను చూచి లోకం ఏమనుకుంటుందో గదా అని వగచింది. ఈ మారు యిట్టి సంతానానికి కారణం ఎవరై వుంటారనికూడా ఆలోచించింది. భర్తకే కబురు తెలిసివచ్చాడు. ఆ దృశ్యం చూశాడు. భరించలేక పోయాడు. భార్య తనను ఆ నాడు పురిటిగదిలో అన్నమాటలు వప్పగిద్దామా అనుకున్నాడు. కాని యిది సమయం కాదని అనాలోచితంగా అనేసిందని తానుకూడా అని మనస్సు నొవ్వ చేయడం మంచిది కాదని వూరుకుని ఓదార్చి యింటికి వెళ్లిపోయాడు. పుట్టిన 15 గంటలలో ఆకుర్రాడు చనిపోయాడు విశేషశ్రమ బాధ పెట్టకుండానే. మామూలు ప్రకారం లోకాచారం జరిగిపోయింది.

లలిత యీదఫా ఒకనెల రోజులుకంటే హెచ్చు వుండకుండానే భర్తదగ్గరకు వెళ్లిపోయింది. పిమ్మట ఒకనాడు లలితతో 'మొదటిది సరేగాని, యీ తప్పు ఎవరిది?' అని కడుపులోవున్న మంట పైకి కక్కేశాడు.

“నా తప్పు కాదు. మీ తప్పు కాదు. ఎవరి కర్మ వా రనుభవించవలసిందే. మన యిరువురం చేసుకున్న పాపఫలమే అటువంటి ఆరెంటి అసహ్యపు సంతానాలకు కారణం. మనకడుపున పడమని వాళ్లకును, యిటువంటి సంతానంచూచి దుఃఖించమని మనకును విధి ఏర్పాటు అయియుండగా మన తప్పేముంది యిందులో. ఏదో ఆరెంటు అలా అయిపోయినాయి గదా యిక—'అంటూ వూరుకుంది.

ఆమాటఅన్న ఆరునెలలకల్లా తిరిగి లలిత గర్భం దాల్చింది. ఆతర్వాత సంతానం చాలాబాగుంది. తిరిగి కొడుకే పుట్టాడు. ఏ అవయవలోపంలేకుండా బహుఅందంగాకూడా ఉన్నాడు. లలితామోహనరావుల సంతోషం యింతా అంతాగాదు. లలిత తల్లిదండ్రులుకూడా ఎక్కువ ఆనందించారు. సంతోషంగాను, ఎక్కువ శోభస్కరముగాను యీదఫా బారసాల చేసుకున్నారు. చాలామంది స్నేహితులు, బంధువులుకూడా వచ్చారు. బారసాలానంతరం స్నేహితులు, బంధువులు ఎవరి యిండ్లకు వారు ఆసాయంత్రంలోగా వెళ్లిపోయారు. వీలుచూసుకొని భార్యతో “ఇది మన యిరువురి చాకచక్యమేసుమా” అన్నాడు ఏమోస్తరు జవాబిస్తుందో చూద్దామని.

లలిత 'ఏం దెప్పతారండీ. ఏదో అనేశాను అప్పుడు భరించలేక ఆదృశ్యం. క్షమించండి. మన చేతుల్లో ఏమీ లేదు' అని వేడుకుంది. 'ఇంత బుద్ధి ఎప్పటినుంచేమిటి' అంటూ భార్య బుగ్గమీటాడు.